# బెడ్ టైం స్టోరీ

సిండరెల్లా సుకుమార పాదం
గాజు చెప్పు లోకి అందంగా ఇమిడిపోతుంది
తెలిమంచు లాంటి స్నోవైట్ గొంతులో చిక్కుకున్న
ఎర్రటి ఏపిల్ ముక్క ఊపిరాడక బయటపడుతుంది
రాజకుమారుడి ప్రేమార్తి మృదుస్పర్శే తనను స్పృశించగానే
స్లీపింగ్ బ్యూటీ ఒక్కసారిగా నిద్ర లోంచి లేచికూర్చుంటుంది.

కథలన్నీ క్షణాలై కరిగిపోతున్నా
ఈ లేత కలువల కన్నులను మాత్రం
నిద్రాదేవి ఇంద్రజాలం తాకను కూడా తాకలేదు.

ఏపుగా పెరిగిన చిక్కుడు తీగపైకి ఎగబాకిన జాక్
మబ్బుల వెనక సంపదలని కొల్లగొడతాడు.
చిన్నారి పిచ్చుక పిల్లకు అమ్మెవరో తెలిసిపోతుంది
ఏడుచేపలూ గడ్డివామి వెనకాల ఎప్పుడో ఎండిపోయాయి.
దాహమేసిన కాకమ్మకు రాళ్ళకుండలోని తియ్యనినీరు దొరికేసింది
అమెరికా రామయ్యకు ఆంధ్రా సీతమ్మతో తొలిచూపు లోనే పెళ్ళి కుదిరింది

కలగా పులగపు కథలు చెప్తూ చెప్తూ ఓ రెండు క్షణాలపాటు
ఏమారిన నేను అలసటతో రెప్ప మూసానో లేదో
తన చిట్టిచేతుల హారాలతో నా మెడను కౌగలించి ఒదిగిన మల్లెచెండై
నా చిన్నారి రాకుమారి చటుక్కున నిద్రలోకి జారుకుంటుంది.
మా ఇద్దరికీ మురిపెంగా వెచ్చని కలల దుప్పటిని కప్పేసి
కథలన్నీ సద్దుచేయకుండా కంచి కెళ్ళిపోతాయి.

- డా. వైదేహీ శశిధర్